క్లుప్తంగా

10న మండల సర్వసభ్య సమావేశం

కలకడ : ఈనెల 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికల తో హాజరు కావాలన్నారు.

క్యాలెండరు ఆవిష్కరణ

కలికిరి: సమాచార హక్కు చట్టం అవగాహన సంస్థ క్యాలెండరును సోమవారం సీఐ మోహన్ ఆవిష్కరించారు. సంస్థ ప్రతినిధులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐని కలిసి సన్మానించారు. అనంతరం క్యాలెండరు ఆవిష్కరించిన సీఐ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు పోలీసు శాఖ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని సంస్థ ప్రతినిధులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మధుసూదనాచారి, హెడ్‌కానిస్టేబుల్ మనోహర, పీసీలు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

16న లక్కీడిప్ డ్రా

మదనపల్లె సిటీ: మదనపల్లె– రామసముద్రం రూట్‌లో ప్రయాణించే ప్రయాణికులు టిక్కెట్టుపై పేరు, సెల్‌నంబర్ రాసి గిఫ్ట్‌బాక్సులో వేయాలని డీఎం–2 ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఈనెల 16న లక్కీ డ్రా డిప్ తీయనున్నట్లు పేర్కొన్నారు. గెలిచిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

వాహనం వేలం

వాల్మీకిపురం: సీజ్ చేసిన వాహనాన్ని సోమవారం ఉదయం రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించినట్లు ఎస్‌ఐ నాగేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా క్వాలిష్ వాహనానికి వేలం నిర్వహించగా, ఏడుగురు వేలంలో పాల్గొని, రూ.36 వేలకు వేలం పాడినట్లు తెలిపారు. జీఎస్టీతో కలసి 39,600 ట్రెజరీ నందు జమ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

ములకలచెరువు: మండలంలోని బిల్లూరివాండ్లపల్లి సమీపంలో జూదం జోరు సాగుతోందని సమాచారం అందుకున్న ఎస్‌ఐ తిప్పేస్వామి సిబ్బందితో కలసి సోమవారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురు నిందితులు పట్టుబడగా వారి వద్ద లభించిన రూ.24,250ల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ వైరు చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసిన దుండలు

పీలేరు : మండలంలోని జాండ్ల పంచాయతీలో దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి వైరు చోరీ చేశారు. వివరాలిలావున్నాయి. జాండ్ల గ్రామం నందకుమార్‌రెడ్డి వ్యవసాయ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగలు ధ్వంసం చేసి అందులోని రాగి వైరును చోరీ చేశారు. అలాగే బోరుకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైరును చోరీ చేశారు. సోమవారం ఉదయం విషయం తెలుసుకున్న నందకుమార్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సెక్టోరియల్ అధికారులు టి. రెడ్డెప్ప, ఏఎస్‌ఐ రామకృష్ణ పరిశీలించారు. సోమవారం మండలంలోని కోటపల్లె, గూడరేవుపల్లెలో ఏడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో సరైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్‌చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని వడ్డిపల్లె సమీపంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి సారా విక్రయిస్తున్న జి.ఆదెమ్మ(70)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్ద నుంచి 5లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కర్నాటక మంత్రికి ఆహ్వానం

వాల్మీకిపురం: కర్ణాటక రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎంసీ సుధాకర్‌ను వాల్మీకిపురంలోని శ్రీ పట్టాభిరామాలయం, షిరిడిసాయి ఆలయాలను సందర్శించాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ ఆహ్వానించారు. సోమవారం కర్ణాటక రాష్ట్రం చింతామణి నియోజకవర్గం చిన్నసంద్రాలో హజరత్ మహబూబ్‌షావలి ఉరుసు కార్యక్రమంలో వీరు కలుసుకున్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'

- ఆర్డీఓ హరిప్రసాద్
- వీఆర్వో నారాయణపై చర్యలు తీసుకోవాలని వినతి


ఆర్డీఓ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు

మదనపల్లె : ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసమే రాష్ట్రప్రభుత్వం జగనన్నకు చెబుదాం నిర్వహిస్తోందని ఆర్డీఓ హరిప్రసాద్ అన్నారు. సోమవారం మదనపల్లె రెవెన్యూ డివిజన్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నేరుగా ఆయన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మదనపల్లె మండలం పొన్నేటిపాలెం వీఆర్వో నారాయణ 140 ఎకరాల భూమిని 170 ఎకరాలుగా ఆన్‌లైన్‌లోకి ఎక్కించి, ఎలాంటి హక్కులేని వారి పేరుతో భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ వినతిపత్రం సమర్పించారు. పొన్నేటిపాలెం పంచాయతీ పనసమాకులపల్లెకు చెందిన ఎస్.రామకృష్ణ, చలపతి, ఆర్.రాజ్‌కుమార్, వెంకటరమణ, గోపాల్‌రెడ్డి, గంగులప్ప తదితరులు పిత్రార్జితం కింద సర్వేనెంబర్.272, 278, 279, 277, 498, 275లో మొత్తం 140 ఎకరాల విస్తీర్ణం భూమిని కలిగి ఉన్నారన్నారు. భూమిని ఎలాంటి సబ్‌డివిజన్‌లు, భాగపరిష్కారాలు చేసుకోలేదన్నారు. కొంతమేర వ్యవసాయం చేసుకుంటూ, మిగిలినది బీడుగా వదిలిఉంటే, వీఆర్వో నారాయణ 140 ఎకరాల భూమిని 170 ఎకరాలుగా ఆన్‌లైన్ చేసి ఇతరుల పేరుతో పాసుపుస్తకాలు మంజూరుచేస్తున్నారని ఆరోపించారు. కోళ్లబైలు జగన్ కాలనీలో మౌలికవసతులు కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రధానంగా తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని కాలనీవాసులు అర్జీ సమర్పించారు. రాష్ట్రంలోని వాల్మీకిబోయలకు సంబంధించిన ఎస్టీ రిజర్వేషన్ తీర్మానం బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు విజ్ఞాపన పత్రాన్ని ఆర్డీఓకు వాల్మీకి రిజర్వేషన్ సాధనసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పొదల నరసింహులు, వీఆర్‌ఎస్ నాయకులతో కలిసి అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకమునుపే ఆంధ్రప్రదేశ్ వాల్మీకిబోయల గిరిజన రిజర్వేషన్ తీర్మానం సిఫారసును వెంటనే అమలు చేసేలా, అధికార వైఎస్సార్ సీపీ, ప్రతిపక్షాలు అసెంబ్లీలో మరోసారి చర్చ నిర్వహించాలని కోరారు. ఒక పేద విద్యార్థి ఆర్థిక ఇబ్బందులతో సకాలంలో ఫీజులు చెల్లించక, ఆలస్యం చేసినందుకు అతడిని ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరుకానివ్వకుండా, విద్యార్థి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసినందుకు ఎస్‌జీఆర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు.

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ అధికారిగా హరిప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఈయన పెనుగొండ, కర్నూలు ఆర్డీఓగా పనిచేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్నూలు ఆర్డీఓగా పనిచేస్తున్న హరిప్రసాద్‌ను మదనపల్లెకు బదిలీచేశారు. 2014 ఎన్నికల సందర్భంగా వాల్మీకిపురం తహసీల్దార్‌గా హరిప్రసాద్ అన్నమయ్య జిల్లాలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ గతంలో దేశంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా పేరుమోసిన మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్నతపదవుల్లో ఉన్నటువంటి ఐఏఎస్‌లు మదనపల్లె సబ్ కలెక్టర్‌లుగా పనిచేసి అనుభవం గడించారని, అలాంటి చోట తనకు పనిచేసేందుకు అవకాశం రావడం దైవసంకల్పమన్నారు. డీఏఓ రఫీక్‌అహ్మద్, డీటీ గురుప్రసాద్, రాజేష్, డివిజనల్ సర్వేయర్ కృష్ణమూర్తి, సబ్ కలెక్టరేట్ సిబ్బంది కలసి ఆర్డీఓకు ఘనస్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి


చెంబకూరులో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

రామసముద్రం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక చెంబకూరులో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చెంబకూరు పోలింగ్ కేంద్రాలను ఎస్‌ఐ చంద్రశేఖర్ సెక్టోరియల్ ఆఫీసర్ గంగాధర్ , పోలీస్ సిబ్బంది, మహిళా పోలీస్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని , ఇతర అవాంఛనీయ సంఘటనలకు సహకారం అందించిన, ఇతర చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంబేడ్కర్ గురుకులాల్లో దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపల్ కల్పన

వాల్మీకిపురం: స్థానిక డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఈ విద్యా సంవత్సరానికి గానూ 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కల్పన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 23వ తేదిలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష మార్చి 10న జరుగుతుందన్నారు. వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

కేన్సర్‌ను సకాలంలో గుర్తించాలి


మాట్లాడుతున్న రిటైర్డు డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

మదనపల్లె సిటీ: క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించి తగిన చికిత్స తీసుకోవాలని రిటైర్డు డీఎంహెచ్‌ఓ పూల వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక అమ్మచెరువు మిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ప్రపంచ కేన్సర్ డేను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేన్సర్ అనేది శరీరంలోని కొన్ని కణాలు అనియంత్రితంగా అభివృద్ధి చెంది శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించడం ద్వారా వస్తుందన్నారు. ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్ల రోగ నిర్ధారణ ఆలస్యమై మృత్యువాత పడుతున్నారన్నారు. ముఖ్యంగా మహిళలలో రొమ్ము కేన్సర్ కేసులను పాప్‌స్మియర్ టెస్టు ద్వారా ముందే గుర్తించవచ్చున్నారు. గర్భాశయ కేన్సర్ బారిన పడకుండా ముందస్తు వాక్సిన్ తీసుకోవాన్నారు. కార్యక్రమంలో వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ శివకుమార్ బాధ్యతల స్వీకరణ



తంబళ్లపల్లె: తంబళ్లపల్లె ఎస్‌ఐగా శివకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గాలివీడులో పనిచేసి బదిలీపై వచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఫిర్యాదులపై న్యాయం చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు లేకుండా నివారిస్తామన్నారు. త్వరలో జరగబోయే ఎన్నికలలో భాగంగా ప్రత్యేక నిఘాతో నేరాలకు అదుపుకు కృషి చేస్తానన్నారు.

ఉత్తమ మార్కులు సాధించాలి


నడిమిచెర్ల ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న డి.జాకీర్‌హుస్సేన్

కలకడ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలోని విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు డి.జాకీర్‌హుస్సేన్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని నడిమిచెర్ల ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం, రాత్రి దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలు, విద్యార్థుల పట్ల తీసుకుంటున్న శ్రద్ధపై వార్డెన్ బాబును అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ప్రభుత్వం హాస్టల్ లోనూ ఉత్తమ సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. అందరూ సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఉత్తమ విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని గుర్తు చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

మదనపల్లె : జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని సీటీఎం క్రాస్ పంచాయతీ మిట్టపల్లె సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో మదనపల్లె మండలానికి చెందిన సూరిబాబు(36), జే.చలపతి(40), పి.వెంకటరమణ(42), జి.చంద్ర(35), నిమ్మనపల్లె మండలానికి చెందిన బి.రెడ్డెప్ప(45), కురబలకోట మండలానికి చెందిన ఏ.రామకృష్ణ(53)లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారివద్ద నుంచి రూ.9,250 నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ


పీలేరు : మహబూబ్‌బాషా


వాల్మీకిపురం: ఖాతిజున్ కుప్రా


పెద్దమండ్యం: లక్ష్మీనాయక్


బి.కొత్తకోట: పుణ్యవతి


పెద్దతిప్పసముద్రం: శ్రీనివాసులు


మదనపల్లె : రమాదేవి


తంబళ్లపల్లె: బ్రహ్మయ్య


కలికిరి: విజయకుమారి

పీలేరు : పీలేరు మండల తహసీల్దార్‌గా మహబూబ్‌బాషా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇది వరకు పీలేరు తహసీల్దార్‌గా ఉన్న ధనుంజయలు బదిలీపై కడప జిల్లాకు వెళ్లారు. అనంతపురం జిల్లా గుత్తిలో తహసీల్దార్‌గా పని చేస్తున్న మహబూబ్‌బాషా బదిలీపై ఇక్కడికి వచ్చారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

వాల్మీకిపురం తహశీల్దార్‌గా ఖాతిజున్ కుప్రా

వాల్మీకిపురం: వాల్మీకిపురం తహసీల్దార్‌గా ఖాతిజున్ కుప్రా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ధర్మవరం డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉన్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు.

పెద్దమండ్యం తహసీల్దార్‌గా లక్ష్మీనాయక్

పెద్దమండ్యం: పెద్దమండ్యం తహసీల్దార్‌గా బి. లక్ష్మీనాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జె రాము వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లాలోని పెద్దపప్పూరు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ నాయక్ పెద్దమండ్యంకు బదిలీపై వచ్చారు.

బి.కొత్తకోట తహసీల్దార్‌గా పుణ్యవతి

బి.కొత్తకోట: నూతన తహసీల్దార్‌గా జి.పుణ్యవతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా అనంతపురం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆమెను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణకు సహకరించాలని, ఎప్పటికప్పుడు నిర్ణీత ఆదేశాలను పాటించాలని కోరారు. ఇక్కడ పనిచేస్తున్న రఫీక్ అహ్మద్‌ను మదనపల్లె డీఏఓగా బదిలీ అయ్యారు.

పెద్దతిప్పసముద్రం తహసీల్దార్‌గా శ్రీనివాసులు

పెద్దతిప్పసముద్రం: మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాళ్ మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

మదనపల్లె తహసీల్దార్‌గా రమాదేవి

మదనపల్లె : మండల తహసీల్దార్‌గా రమాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్‌చాంద్ తిరుపతి జిల్లాకు బదిలీపై వెళ్లగా, ఆమె స్థానంలో అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం తహసీల్దార్‌గా పనిచేస్తున్న రమాదేవిని బదిలీ చేశారు.

కురబలకోట తహసీల్దారుగా ఈశ్వరమ్మ

కురబలకోట: మండల తహసీ ల్దారుగా ఈశ్వరమ్మ సోమవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ సిబ్బంది ఈమెకు స్వాగతం పలికారు. ప్రజలకు అందుబాటులో ఉంటు వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆమె తెలిపారు.

తంబళ్లపల్లె తహసీల్దార్‌గా బ్రహ్మయ్య

తంబళ్లపల్లె: మండల తహసీల్దార్‌గా బ్రహ్మయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో అనంతపురంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

కలికిరి తహసీల్దారుగా విజయకుమారి

కలికిరి: మండల తహసీల్దారుగా పి.విజయకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కుందుర్పి మండల తహసీల్దారుగా పనిచేస్తున్న ఈమె వచ్చే సాధారణ ఎన్నికల బదిలీలల్లో భాగంగా కలికిరి మండలానికి బదిలీపై వచ్చారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి


ఆటో డ్రైవర్లనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ మోహన్

కలికిరి: ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ ఆర్.మోహన్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కలికిరి పరిధిలోని ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహన రికార్డులు కలిగి ఉండాలని, ఆటోలకు రేడియం స్టిక్కర్లు అంటించాలని సూచించారు. ప్రయాణికుల పట్ల మంచి ప్రవర్తన ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు ప్రయాణిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రమాదాల నివారణకు ప్రతి డ్రైవరు సహకరించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మధుసూదనాచారి, హెచ్‌సీ మనోహర్ పాల్గొన్నారు.

తాగునీటి కొళాయిలు ఏర్పాటు


పైపులైన్ పనులు చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : మండలంలోని కావలిపల్లె పంచాయతీ వడ్డిపల్లెలో రూ. 2 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ ఎ. రెడ్డెమ్మ తెలిపారు. సోమవారం గ్రామంలో కొళాయిల ఏర్పాట్లుకు పైపులైన్ల పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కీం బోరు నుంచి పైపులైను ఏరాటు చేసి కొళాయిలు అమర్చుతున్నట్లు తెలిపారు. గ్రామం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లోకనాథరెడ్డి, గురుమూర్తి, నాగరాజ, సైషావలి, సద్దాం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల మన్ననలు పొందాలి


మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం డిపో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆదాయం పెంచేందుకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. అక్రమ వాహనాలను అడ్డుకోవాలన్నారు. డిపోను జిల్లాలో మొదటి స్థానం నిలపాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్యదారులకు ఎమ్మెల్యే హామీ


ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, మల్లయ్యదారులు

పెద్దమండ్యం: తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఉత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న మల్లయ్యదారులను ఆదుకుంటామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హామీ ఇచ్చినట్లు ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద సోమవారం ఎమ్మెల్యే చిత్రపటానికి బురుజుకురవపల్లె, చిన్నకురవపల్లె లకు చెందిన మల్లయ్యదారులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా స్వామి వారి సేవలో తరిస్తున్న మల్లయ్యదారులకు ఇటీవల జరిగిన సమావేశంలో ప్రతి ఒక్కరికి నెలసరి రూ.2 వేలు, ఇంటి స్థలం, 2 ఎకరాల చొప్పున భూమి ఇస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, జింకా విశ్వనాథ, కంటి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ మంచూరి జయరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు బోడిమానిరామిరెడ్డి, కేశవ, పీరాన్, జయచంద్రారెడ్డి, గుర్రం రామచంద్ర, నరసింహులు, మల్లయ్యదారులు పాల్గొన్నారు.

బాలికల చదువుతోనే నవ సమాజ నిర్మాణం


మాట్లాడుతున్న ఎంఈవో త్యాగరాజు

తంబళ్లపల్లె: బాలికల ఉన్నత చదువుతోనే కుటుంబాలు ఆర్థికంగా ఎదగడంతో పాటు నవ సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని ఎంఈవో త్యాగరాజు అన్నారు. సోమవారం కస్తూర్బా బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థినులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సంతోషాన్ని పంచుకున్నారు.

స్పర్శలేని మచ్చలపై అవగాహన


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వాల్మీకిపురం: ప్రతి ఒక్కరూ స్పర్శలేని మచ్చలపై అవగాహన కలిగి ఉండాలని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి సూపర్‌వైజర్ సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని చింతపర్తి యూపి ఉర్దూ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పర్శలేని మచ్చలు ఉండడం వలన శరీరములో నరాలను డామేజ్ చేసి చేతివేళ్లు, కాలి వేళ్లు వంకర పోయి అంగవైకల్యం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సలీంఖాన్, సిబ్బంది సబాన, భానుబీ, అనురాధ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లె పంచాయతీ రెక్కలకొండమానుకు చెందిన విద్యార్థి పి.సంతోష్(17) ద్విచక్రవాహనంలో వస్తుండగా, ముదివేడు టోల్‌ప్లాజా వద్ద బైక్‌ను కారు ఢీకొంది. ప్రమాదంలో సంతోష్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అదేవిధంగా వాల్మీకిపురం మండలం కూరపర్తికి చెందిన శ్రీరాములు ఆచారి(30) ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై మదనపల్లె బైపాస్‌రోడ్డు మినీలారీ అసోసియేషన్ సమీపంలో వెళుతుండగా, అదే సమయంలో పుంగనూరు రోడ్డులో నివాసం ఉన్న రెడ్డిబాషా(60) తన భార్య పి.తౌహిద్‌ఖానంతో కలిసి ద్విచక్రవాహనంలో వస్తుండగా, శ్రీరాములు ఆచారి వెనుకవేపు నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చంద్రాకాలనీలో కార్డెన్‌సెర్చ్

- రేషన్‌బియ్యం,
- ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

మదనపల్లె : పట్టణంలోని చంద్రాకాలనీలో సోమవారం ఉదయం టూటౌన్ సీఐ యువరాజు సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అందులో భాగంగా అక్రమంగా తరలిస్తున్న 9 బస్తాల పీడీఎస్ రైస్, ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ యువరాజు మాట్లాడుతూ... జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో చంద్రకాలనీ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. అందులో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా, వాల్మీకిపురంకు చెందిన సమీవుల్లా ఆటోలో 9 బస్తాల పీడీఎస్ రైస్ సుమారు 440కిలోలు తరలిస్తుండగా, స్వాధీనం చేసుకున్నామన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరు నిందితులపై వేర్వేరుగా కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని, అక్రమమద్యం, అసాంఘిక కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్డెన్‌సెర్చ్‌లో ఎస్‌ఐలు వెంకటసుబ్బయ్య, ఇనాయతుల్లా, ఏఎస్‌ఐలు ఇమామ్, వై.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.